Mohan PUBLICATIONS

బాలల రామాయణం

నూరు పద్యాలలో....

రచన :
పంతుల వెంకట రాధాకృష్ణ

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్

మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట, రాజమహేంద్రవరం – 533 101.
FB@mohanpublications Granthanidhi.blogspot.in

పరాశ్రీ

బాల రామాయణం

అంకితం

కం॥ బాలల రామాయణమును
సాలంకృత పొత్తమిత్తు సద్విజ వరు, గో
పాలక్రిష్ణకు, రాధకు
పాలింపగ సాహితి మతి ప్రగతిన్ గూర్చన్

భారద్వాజస గోత్రోద్భవుడగు కరుణాకరం గోపాలక్రిష్ణ గారు, సుబ్బారావు సుభద్ర దంపతులు గర్భ శక్తి ముక్తా ఫలము. శ్రీకాకుళం జిల్లా, హరిశ్చంద్రాపురం అగ్రహారం వీరి జన్మస్థలం. నేడు విశాఖలో ప్రముఖ వ్యాపారవేత్తగా ఎదిగిన వీరు, 1979 వరకూ జమ్‌షెడ్‌పూర్ టాటా సంస్థలో ఉద్యోగి. స్వచ్ఛంద పదవీ విరమణజేసి 1980 నుండి విశాఖలో భారీ పరిశ్రమల యంత్రాల విడిభాగాల అమ్మకమును జేయు వ్యాపారము ఆరంభించి అంచలంచెలుగా ప్రముఖ వ్యాపారవేత్తగా స్థిరపడినారు.

శ్రీ కరుణాకరం గోపాలక్రిష్ణ గారు, శ్రమపడే పారిశ్రామికవేత్త, ఎంత ఎదిగినా ఒదిగి, నిగర్విగా యుండే స్వభావ దురంధరులు. వీరి సహధర్మచారిణి కరుణాకరం రాధగారు కూడా చేదోడు వాదోడుగా యుండే సహచరణి. తెలుగు సంస్కృత భాషలలో విదుషీమణి. విశాఖ సి.బి.యం. స్కూలులో పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయిని.

విశాఖ – బ్రాహ్మిన్ ఫోరంలో మరియు అనేక సందర్భాలలో ఈ దంపతులు చేసిన సేవలు, సర్వత్రా శ్లాఘనీయం. పేదలు, అనాథుల, నిరాశ్రయుల సేవకై అచెంచల కృషిజేయుచున్నారు. బ్రాహ్మణ సంఘ కులాభివృద్ధికి, ప్రగతికి మార్గదర్శకమగు పాత్రను పోషించుచున్నారు. వ్యాపార బాధ్యతలు నిర్వర్తిస్తూనే భక్తి తత్పరతతో – చినగదిలిలో ఆంజనేయస్వామి ఆలయం మరియు శివాలయంలు వీరి స్వంత నిధులతో నిర్మాణం చేసారు. ముడసర్లోవ గణేష్ మందిరం – పెదగదిలి షిర్డి సాయి మందిరం – నిర్వహణలో చిరస్మరణీయమైన కృషి చేసినారు.

శ్రీ గోపాలక్రిష్ణ గారి దంపతులకు నలుగురు సంతానం, చి॥ నగేష్, చి॥ శ్రీనివాస్, తండ్రి వలె వ్యాపారంలోనే స్థిరపడ్డారు. కుమార్తెలిద్దరు చి॥ కామేశ్వరి, చి॥ సుభద్ర, బుల్లయ్య కాలేజిలో లెక్చరర్స్‌గా స్థిరపడినారు. వీరందరూ వివాహితులై సుఖ సంసారాలను నెరపుతున్నారు. తాను పుట్టిన కులంలో, తన వారి అభ్యున్నతికై అన్న దానాలు, వస్త్ర దానాలు, యజ్ఞాలు నిర్వహిస్తూ, శేష జీవితంలో కూడా విశేషంగా భావితరాలకు మార్గదర్శకంగా, నేటి సంఘాలకు "కరదీపికలుగా" – సేవానిరతితో వ్యవహరిస్తున్న వీరికి ఆ సింహాచలేశుడు సర్వశుభాలను చేకూర్చాలని మనసారా ఆశిస్తున్నాను.

అంకిత భావంతో కృషిచేసే వీరికి, తన పుస్తకాన్ని అంకితమిస్తున్న – "పరాక్రి బాలల రామాయణం" రచయిత శ్రీ పంతుల వెంకట రాధాకృష్ణ గారికి, వారి శ్రీమతికి, సంతానానికి, నా శుభ ఆశీస్సులు.

ఇట్లు
యామిజాల రాంజీ
కార్యదర్శి, బ్రాహ్మిన్ ఫోరమ్

ఆప్త వాక్యం

సభా సారథి, సాహితీచైతన్య
సాహిత్య విద్యా ప్రవీణ, భాషాప్రవీణ, నేత్రావధాని
డా॥ **అయలసోమయాజుల గోపాలరావు**
ఎమ్.ఏ., పి.హెచ్.డి
రీడర్ - ఆంధ్ర భాషాశాఖాధ్యక్షులు (రిటైర్డ్)
మహారాజ ప్రభుత్వ సంస్కృత కలాశాల
విజయనగరం

ప్రధానకార్యదర్శి
విజయభావన (సాహితీ మిత్రసమాఖ్య)
శారదా మందిరం
25-5-15, సుబ్రమణ్యం పేట,
విజయనగరం.

శ్లో॥ శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే।
సహస్ర నామ తత్తుల్యం రామనామ వరాననే॥

పార్వతికి పరమేశ్వరుడు ఉపదేశించిన తారక రామ మంత్రం. విశ్వభాషాసు గీర్వాణ వాణీవరా। తత్ర రామాయణం ..... అన్నారు. అదికవి వాల్మీకి! శ్రీమద్రామాయణం ఆవిర్భవించిన నాటినుండి ప్రపంచ ప్రజలలో రామాయణ కథ అనేక రూపాలలో ఆవిష్కృత మవుతూనే ఉంది.

ఉ॥ వ్రాసిన రామచంద్రు కథ వ్రాసితి వంచనిపించుకో వృధా
యాసము గాక కట్టుకతలైహికమా పరమా యటంచు దా
జేసిన తండ్రి యాజ్ఞయును జీవుని వేదన రెండు నేకమై
నాసకలోహ వైభవ సనాథము నాథ కథన్ రచించెదన్॥

అనే పద్యం కవి సామ్రాట్ విశ్వనాథ రామాయణ కల్పవృక్షానికి మూలం......, పితృ వాక్యం కాబట్టి మరల నిదేల రామాయణం బన్నచో....., తలచిన రామాయణాన్నే తలచెదను నేను. నా భక్తి రచన నాదిగాన అన్నారు. విషం జల్లిన వారు మూర్ఛ పోయారేమోగాని, కల్పవృక్షం జ్ఞాన పీఠాన్నలంకరించింది.

ఉ॥ రాజిత కీర్తి యైన రఘురామ చరిత్రము నన్ కవీశ్వరుల్
తేజమెలర్ప జెప్పితిని తెల్సియు గ్రమ్మర చెప్పనేలనన్
భూజన కల్పకంబగును భుక్తికి ముక్తికి మూలమైన మా
రాజుల దైవమైన రఘురాము నుతించిన దప్పు గల్గునే॥

ఇది కవయిత్రి మొల్ల భావన. ఇంకాస్త వెనక్కి వెళితే,

కం॥ ఎత్తరి నైనను ధీరో
దాత్త నృపోత్తముడు రామ ధరణీపతి స
ద్వృత్తము సంభావ్య మగుట
ఉత్తర రామా యణోక్తి యుక్తుడ నైతిన్॥

నిర్వచనోత్తర రామాయణ రచనలో కవిబ్రహ్మ తిక్కన గారి భావన ఇది. ఇలా ఎన్నెన్నో రూపాలుగా రామకథ రూపొందుతునే యుంది.

శ్లో॥ యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే! తావద్రామాయణ కథాలోకేషు ప్రచరిష్యతి॥ అన్న బ్రహ్మ భావన దీవెన.

ఈ నేపథ్యంలో బాలల రామాయణం ఇది. కవి మిత్రుడు చి॥ పంతుల వెంకట రాధాకృష్ణ (పరాక్రి) చిరకాల కవితాభ్యాసానికి అక్షరాకృతమై అందగించింది. గాయిత్రీ మంత్ర బీజాక్షరాలతో 24 వేల శ్లోకాలుగా వాల్మీకి రామాయణం ప్రభవించింది. అదే ... రామ తపోవనాది గమనం అంటూ ఏకశ్లోకీ రామాయణం ఉంది. కట్టె, కొట్టె, తెచ్చె అనే మూడు క్రియలతో రామాయణ కథను చెప్పుకోవచ్చు. పరాక్రి బాలల రామాయణాన్ని ఇష్ట దేవతా స్తుతితో కలిపి వంద గీత పద్యాలుగా అష్టోత్తరశత ప్రబంధంగా నిబంధించేరు.

వాల్మీకి రామాయణంలో లేని ఎన్నో కల్పనలు ఇతర రామాయణంలో చోటు చేసుకున్నాయి. రావణుడు సీతను ఒడిసి పట్టుకుని తన తొడపై కూర్చోబెట్టుకుని తీసుకు పోతాడు, ఇదీ వల్మీకం. - కానీ తర్వాత సీతమ్మకు పవిత్రత కల్పించడం కోసం, సీతను తాకకుండా, భూమిని పెళ్ళగించి తీసుకెళ్ళాడని ప్రచారంలోకి వచ్చింది. దీనినే పరాక్రి కూడా ఉట్టంకించాడు. చూ. 60వ పద్యం - "భిక్షమిడగ రాగ పృధివిని పెకలించి".

దశరథుడు పాయసాన్ని కౌసల్యాదులకివ్వడంలో, ఆయా భాగాలు వాల్మీకి ఒకలాగా ఇతర రామాయణాలలో భిన్న భిన్న రీతులలో ఉన్నాయి. కానీ పరాక్రి సంక్షిప్తంగా సులభంగా ఉండేలా 7వ పద్యంలో "పాయసంబు నొసగె భార్యల కద్దాని మెసవి ప్రీతి" అన్నారు. వనవాసానికి తననూ అంగీకరించమని సీత రాముని కోరిన సందర్భంలో 42వ ప. "పతిని గలిసి యున్న వనియైన గిరియైన",.... అన్న సీత భాషణం పతివ్రతా లోకానికి శిరోభూషణం. శూర్పణఖకు లొంగని లక్ష్మణుని శీలాన్ని వర్ణిస్తూ 52వ ప. "ధీర చిత్తులెపుడుతెరవకు లొంగరు"... అన్న ధీర లక్షణం మనుచరిత్రలో "ప్రాంచద్భూషణ బాహుమూల రుచితో.... మలచునే సతుల మాయల్ ధీర చిత్తంబులన్" అన్న పద్యాన్ని తలపిస్తోంది.

లక్ష్మణుడు మూర్ఛితుడైనపుడు రాముడు అన్నమాట రామాయణ ఆకర్ణరత్నాలలో ప్రధానమైనది. దేశే దేశే కళత్రాణి దేశే దేశేచ బాంధవాః । తంతు దేశం న పశ్యామి యత్ర భ్రాత సహోదరః ॥ ఈ అందమైన భావాన్ని పరాక్రి గారు ఎంత మిన్నగా చెప్పారో, 92వ ప. "దేశ దేశములలో తెరవలు దొరకరా"...

సుందర కాండలో హనుమ సీతను వెతకడం, తిరిగి చెప్పడం... అపుడేమనాలి... ముందుగా సీతా అని ప్రారంభిస్తే... మృతవా... నదృష్ట్వా... ఇలా ఎన్నెన్నో సందేహాలు వస్తాయి. అందుకని వాల్మీకి ముందుగా దృష్ట్వాతో శ్లోకం ప్రారంభించడం గొప్ప విశేషం. అలాగే ఇంచుమించు రామాయణ కవులందరూ... కంటిన్... తోడనే ప్రారంభించారు. పరాక్రి కూడా "చూచి వచ్చితి జానకీ శోకమూర్తి" అనడం మహాకవుల మార్గం. ఇంకా ఎన్నో నీతులు పుష్కలంగా ఉన్నాయి. మచ్చుకు కైక లోభాన్ని వర్ణిస్తూ... "ప్రేమ మరుగు పడును పెన్నిధినాశింప".... 39వ పద్యం.

ఇలా చెప్పుకుంటూ పోతే మూల కావ్యం అంతా వచ్చేస్తుంది. చిన్న చిన్న పదాలతో... చిక్కని భావాలతో చక్కగా సాగింది రచన. వీరి రామాయణ లక్ష్యం వీరి మాటల్లోనే చూద్దాం... ప్రార్థనా పద్యం 7లో "శతకాలెన్నియొ కలిగియు, నీతుల బోధనలు సేయ నేర్పున కథలో, ప్రీతిగ గూర్చెద పద్యము, చేతను విద్యార్థి హృదిని జేరగ రామా". పద్యాలకు చిన్న వివరణకూడా ఉన్నది కాబట్టి అందరికి అర్థమవుతుంది. కావ్యాన్ని స్వీకరించి కవిని అభినందించి పిల్లలకు అందించమని సహృదయ లోకానికి సాధు వాదాలతో...

పరాక్రి కవి మిత్రునికి ఆశీరభినందనలతో...

- ఇతిశమ్ -

విజయనగరం
శారదా మందిరం
తేది 04-04-2010

సహృదయ విధేయుడు,
డా॥ అయలసోమయాజుల గోపాలరావు

మధురం మధురాక్షరం

డా॥ **డి.వి. సూర్యారావు**
సాహిత్య విమర్శకులు, రచయిత
విశ్రాంతోపన్యాసకులు, బి.వి.కె. కలాశాల, విశాఖపట్నం.

శ్లో॥ కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్।
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్॥

భారతీయులకు శ్రీమద్రామాయణం ఆరాధ్యగ్రంథం. తెలుగువారికి రాముడు ఇష్టదైవం. రామకథను వివిధ భాషలలో ఎందరో కవులు వివిధ ప్రక్రియలలో రచిస్తూనేయున్నారు. విశ్వనాథ వారు, మరల నిదేల రామాయణంబన్నచో....నాదైన భక్తి రచనలు నావిగాన అన్నారు. నేటికి తమ తమ భక్తి ప్రపత్తులతో ఎందరో రామకథకు అక్షర రూపం ఇస్తూనే ఉన్నారు.

పరాక్రి కలం పేరుగల పంతుల వెంకట రాధాకృష్ణ గారు విద్వద్వంశానికి చెందినవారు. రామాయణగాథను నూరు పద్యాలలో వ్రాయమని పితృ ఆదేశం. ఆ ఆదేశాన్ని పాటిస్తూ వారు పితౄణం తీర్చుకుంటున్నారు. 24వేల శ్లోకాల రామాయణాన్ని కేవలం వంద పద్యాలలో చెప్ప బూనడం ఒక విలక్షణ ప్రయత్నం. పైగా పద్యాలకు భావం కూడా వ్రాసారు. విద్యార్థులలో పద్య పఠనాశక్తి పెంపొందించాలనే సంకల్పంతో ఈ ప్రయత్నం చేసినట్లుగా కవి చెప్పుకున్నారు. వారి సంకల్పం ప్రయత్నం అభినందనీయం. ఈ ప్రయత్నం కొండను అద్దంలో చూపడం లాంటిది. అయినా అందంగానే భాసించింది.

పరాక్రి గారి పద్యాలన్నీ లలితమైన పదాలతో సరళ సుందరంగా రచించారు. బాలల రామాయణం అనే శీర్షిక ఈ గ్రంథానికి సార్థకమైనది. అన్వయ కాఠిన్యంలేని, అస్పష్టతకు తావివ్వని రీతిలో రచన సాగించారు.

పతిని గలిసియున్న వనియైన గిరియైన
రమ్య హర్మ్యమగును రమణి కెపుడు.........
ధీరచిత్తులెపుడు తెరవకు లొంగరు
నీతి దప్పి జనరు నిపుణ మతులు..............

మొదలుగా గల పాదాలలో సూక్తులు ఆణిముత్యాలలా ప్రకాశించాయి. దేశే, దేశే కళత్రాణి... శ్లోక భావాన్ని...... భార్య కొరకు నిన్ను బలిపెట్టి తమ్ముడా...... పద్యంలో అందంగా ఇమిడ్చారు. కందం, తేటగీతి, ఆటవెలదులలో విద్యార్థులకు సులభ గ్రాహ్యంగా రామకథను అందించిన పరాక్రి ప్రశంసనీయుడు. ముమ్ముందు వీరి కలం నుండి బృహత్కావ్యాలు వెలువడ గలవని ఆకాంక్ష.

ఆ శ్రీరామ చంద్రుడు వీరిని సర్వదా కాపాడు గాక.

- శుభం భూయాత్ -

ఇట్లు
డా॥ **డి.వి. సూర్యారావు**
సాహిత్య విమర్శకులు, రచయిత

ఆశాముఖం

నా తండ్రి రామయ్య నా తల్లి సీతమ్మ (సుధా దేవి) సీతారాముల దాంపత్యం ఆదర్శప్రాయమైనదైనా ఆ పేర్లవారు సంసార సాగరంలో ఈదులాడలేరనే అభియోగం ఈ లోకంలో ఉంది. దానికి తోడు వివాహ నిశ్చయం జరిగిన వెంటనే నా తల్లి అగ్ని పునీత కావడంతో పెళ్ళిలో వెంటనే సుధాదేవి అనే ద్వితీయ నామకరణం చేసారు. నా చిన్నప్పటి మాట నేను శృంగవరపుకోటలో చదువుకుంటున్న రోజుల్లో పద్యరచనా సంవిధానాన్ని నాకలవడింపజేస్తూ రామాయణ గాథను నూరు పద్యాలలో వ్రాయాలని మా తండ్రిగారి ఆదేశం.

ఛందోబంధాలలో ఈ కథను వ్రాయ ప్రయాసపడే నన్ను ప్రోత్సహించే దిశలో కొన్ని పద్యాలు నా తండ్రి సహకారంతో వ్రాయబడ్డాయి. మరోమాటలో చెప్పాలంటే అక్షరాలు వ్రాసే కలం నా చేతవుంది కథాకలిత సంవిధానమంతా నా తండ్రి కపోల కలనయే. తరవాత చాలాకాలం అంటే నేను తెలుగు పండితునిగా వుద్యోగంలో ప్రవేశించే వరకు నూరుపద్యాల రామాయణంయే తీరు తెన్నులకు నోచుకోలేదు.

ఈ సఫలీకృత యత్నంలో నా పొరపాట్లు ఏమైనా ఉంటే పెద్దమనసుతో మన్నించి ప్రోత్సహించగలరని వేడుకుంటున్నాను. నా చుట్టూఉన్న ఉపాధ్యాయ విద్యార్థి వర్గం వారి అభిలాష మేరకు రామ కథ సాహితీ ప్రక్రియలో పద్యరూపంగా వ్రాస్తూ భావాన్ని కూడా పొందుపరిచాను.

బాలల రామాయణంగా ప్రార్థనా పద్యాలతో కలిపి 108గా నిబద్ధించుకొనడంతో త్వరగా తొందరగా కథ సాగించడంతో కొన్ని ఘట్టాలను స్పృశించక మరికొన్ని చోట్ల నా స్వేచ్ఛా ప్రవృత్తి కృతకృత్యత దోషాలేమైనా ఉంటే తొలి ప్రయత్నలోపంగా యెంచండి. నిజానికి ఈ రామ కథ శ్రుత పాండిత్యంతో కృతకము చేసినా మన్నించండి. ఆశయం మాత్రం విద్యార్థులలో పద్యపఠనాశక్తి పెంపొందించాలనే.

ఈ పుస్తక ప్రచురణకై తొలిదొలుతగా నన్ను ప్రోత్సహించిన శ్రీ యామిజాల రామనర్సింహం (రాంజీ) గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

ముద్రణా ప్రతిని సంసిద్ధపరిచిన నా సహధర్మచారిణి శ్రీమతి జయ మహేశ్వరికి అభినందనలు.

నూరు పద్యాల రామాయణ ఊహను కల్పించిన నా తండ్రి కీ॥శే॥ శ్రీ పంతుల వెంకట రామారావు గారికి శతనత వందనలు. ఈ రచనచే ప్రచురుణచే నా తండ్రి గారికి స్థిరమైన పరలోకం లభ్యం కావాలని నా ఆకాంక్ష.

నా చదువు, పెండ్లి, వ్యక్తిత్వ వికాసాలకై దోహదకారి నాకు ఆదర్శప్రాయుడైన మా పినతండ్రి బ్రహ్మశ్రీ పంతుల దక్షిణామూర్తి ప్రసాద్ గారికి నా హృదయపూర్వక నమస్కారములు. ఈ పుస్తకానికి ముఖచిత్రీకరణతో పాటు మరో రెండు చిత్రాలను అందించిన సహృదయులు మిత్రులు శ్రీ అనీల్ జోషి గారికి, చిత్రకారులు శ్రీ ఆళ్ళ సత్యారావు గారికి కృతజ్ఞతలు. మరో స్నేహశీలి శ్రీ నూకల సూర్య ప్రకాష్ గారికి కూఢా అభినందనలు తెలియజేసుకుంటూ... ఈ పుస్తకము పై తమ అభిప్రాయములను తెలియజేసిన సాహితీవదాన్యులు బ్రహ్మశ్రీ డా॥ అయలసోమయాజుల గోపాలరావు, ప్రధాన కార్యదర్శి, విజయభావన (సాహితీ మిత్ర సమాఖ్య), విజయనగరం వారికి, డా॥ దామెర వేంకట సూర్యారావు, విశాఖపట్నం గారికి కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

ఇట్లు
పంతుల వెంకట రాధాకృష్ణ (పరాక్రి)
తెలుగు పండిట్, గవర్నమెంట్ హైస్కూల్,
విశాఖపట్నం.

తేది : 13-04-2010
విశాఖపట్నం

- ప్రార్థన -

1. కం// శ్రీమద్గంగా ధారీ
ప్రేమాశ్రిత కల్ప భూజ విశ్వేశప్రభో
సోమాంకిత పాలయమాం
హైమవతీ ప్రాణనాథ యనిమది దలతున్ //

భావము: *శ్రీమతియగు గంగాదేవిని శిరమున ధరించి నెలవంక నొకవంక దాల్చిన శివా, ఆశ్రిత జనులకు కల్పతరువు వంటి దేవా, నను రక్షించు పార్వతీ పతీ, అని ధ్యానింతును.*

2. కం// శ్రీవాణీగిరిజాదుల
కావాసంబైన శక్తి నతిభక్తి మెయిన్
సేవించెదనుల్లంబున
ధీవాగ్విభూతులిడుచు దీవింపంగన్ //

భావము: *లక్ష్మి, సరస్వతీ, పార్వతీ ముమ్మూర్తులా తానే అయి వెలుగొందు ఆదిపరాశక్తీ భక్తితో సేవిస్తున్నాను, వాక్కు, బుద్ధి, సంపద అనుగ్రహించి ఆశీర్వదించుమమ్మా.*

3. కం// శ్రీమద్దివ్యగుణాకర
కామిత ఫలసిద్ధిదాత కరుణా జలధీ
కోమల రమ్యశుభాంగా
రామా భక్తాంజలిదియె రావే బ్రోవన్ //

భావము: *సుగుణాభిరామా, శ్రీరామా, కోరికలు దీర్చు కరుణాసముద్రా, కోమల శుభాంగా భక్తితో నమస్కరిస్తున్నాను. నను బ్రోవుము.*

4. కం// రామా! నిను సేవింపగ
రా మా భద్రాద్రిలోనె రంజిల దగునా
రా మా కోర్కెలుదీర్పగ
రామా నీ నామమెంత రమ్యము దండ్రీ //

భావము: *రామా, నిను సేవించడానికి నీవెక్కడున్నా వస్తాము కదా, భద్రాద్రిలోనే వుండిపోతావా, కోర్కెలు తీర్చుటకు మా దగ్గరకు రాలేవా, నీ నామ జపమే నిన్ను మాకు దగ్గర చేసింది.*

5. కం// హృదయమున నమ్మి విద్యా
సదనుని శుభకార్య ధుర్య సామజ వదనున్
విదిత ప్రజ్ఞుని గణనా
ధుదయల బడయగ నుతింతు తుండపు దేవున్ //

భావము: *విద్యలకు ఆది గురువు, మంచి పనులకు శుభములనిచ్చువాడు, ప్రజ్ఞావంతుడైన, వినాయకుని దయకై మనసారా ప్రార్థిస్తున్నాను.*

6. కం// పిల్లల కథగా జెప్పెద
నుల్లములో పద్య భావనోల్లాసముగా
నెల్లరు పఠియింపంగా
సల్లలితంబగు పదముల సంగతిరామా //

భావము: *అలతి అలతి మాటలతో కథగా చెప్పే సాహితీ ప్రక్రియ ననుసరిస్తూ పిల్లలలో పద్య పఠన ఆశక్తి కలగాలని చదువరులకై వ్రాయ పూనుకున్నాను.*

7. కం// శతకాలెన్నియొ కలిగియు
నీతుల బోధనలు సేయ, నేర్పున కథలో
ప్రీతిగ గూర్చెద పద్యము
చేతను, విద్యార్థి హృదిని జేరగ రామా //

భావము: *అనేక శతకాలు నీతి బోధ చేస్తున్నవి, యీ నూరు పద్యాల రామాయణం కూడా కథారీతిలో సాగిస్తూ, విద్యార్థులలో పద్య పఠనాశక్తి పెరగాలనే తలంపుతో రామకథా సుధారసాన్ని పద్యంతో పాటుగా భావాన్ని కూడా జోడించి, యిది వారిని చైతన్యవంతుల్ని చేయాలని ఆశిస్తున్నాను.*

పరాక్రి బాలల రామాయణం

1. తే.గీ.// శ్రీలకది మెట్టినిల్లని జెప్పదగును
పాడిపంటల తో నిండె, ప్రగతి గాంచె
శత్రువులకభేద్యమని యశమ్ము నొందె
ధర నయోధ్యాపురమ్ము విద్యలకు నెలవు ॥

భావము : *అది ప్రఖ్యాతి పొందిన అయోధ్యా నగరం, అన్ని విద్యలకు నిలయం, సిరిసంపదలకు, పాడిపంటలకు మెట్టినిల్లు, శతృవులకు లొంగని బలమైన కోటగలది.*

2. కం// ఆపురమునేలు రవికుల
దీపకుడగు దశరథుండు ధీచతురుండై
ప్రాపకుడగు ధర్మమునకు
భూపతి వర్గమ్ము నిత్య పూజలు సలుపన్ ॥

భావము : *సూర్యవంశానికి చెందినవాడు, బుద్ధిశాలి, ధర్మాత్ముడు అగు దశరథ మహారాజు సామంతులుచేరి కొలువుండగా ఆ రాజ్యాన్ని చక్కగా పరిపాలించేవాడు.*

3. ఆ.వె.// కలికి మిన్నగాదె కౌసల్య మునితుల్య
సద్గుణ జనమిత్ర సతి సుమిత్ర
కమల పత్ర నేత్ర కైకేయి యనువారు
సతుల గూడి రాజు సంతసించె ॥

భావము : *పెద్దరాణి కౌసల్యాదేవి చాలామంచిది, రెండోరాణి సుమిత్ర అందరితో స్నేహంగా వుండేది, అందాల సుందరి ఆఖరి రాణి కైకేయి, వీరితో, రాజు సంతోషంగా వుండేవాడు.*

4. తే.గీ.// నిండు సభ నొక్కనాడు కూర్చుండియున్న
పౌర భటనట సామంత బంధు జనులు
విన వశిష్టునితో ఱేడు విన్న వించె
చిరవిచారము నివ్విధి సిగ్గుబడుచు ॥

భావము : *ఒకరోజు సభలో పౌరులు సామంతులు వింటూవుండగా విచార వదనంతో గురువు గారైన వశిష్ఠమహర్షితో రాజు యీ విధంగా విన్నవించుకున్నాడు.*

5. తే.గీ.// ఘనతరములగు భోగభాగ్యములు గలవు
మంత్రిసామంత దొరల నమ్మకము జాలు
శాత్రవ భయమ్ము లేదుర్వి శర్వు కృపను
సంతతిని గూర్చి చింతతో సతతముంటి ॥

భావము : *గురువర్యా, సిరిసంపదలకు భోగభాగ్యాలకు కొరతలేదు, మంత్రి, సామంత, దొరలు నమ్మకంగా సేవిస్తున్నారు, ఈశ్వరుని దయ వల్ల శత్రుభయం లేదు కానీ సంతానం లేదనే బాధే తీరలేదు.*

6. తే.గీ.// అనుచు దుఃఖమ్మునందెడు యవని విభుని
గని వశిష్టుడు బోధించె కరుణతోడ
పుత్రకామేష్టి యనుయజ్ఞమును ఘటింప
పొందవచ్చును సంతతి పుడమిలోన ॥

భావము : *అలా దుఃఖిస్తున్న రాజునిచూసి వశిష్టుని మనసు కరిగింది. పుత్రకామేష్టి అనే యజ్ఞం చేస్తే సంతతి కలుగుతుందని ఉపాయం చెప్పాడు.*

7. తే.గీ.// శ్రద్ధతోయజ్ఞక్రియలను సల్పిరేడు
పావకుని చేత తాబొందె పాయసంబు
నొసగె భార్యల కద్దానిమెసవి ప్రీతి
గర్భవతులైరి దశరథ కాంతలంత ॥

భావము : *వెంటనే రాజు ఆ యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో చేసాడు, అగ్నిదేవుడు ప్రత్యక్షమై పాయసాన్ని ప్రసాదించాడు. దశరథుని భార్యలు ఆ పాయసాన్ని భుజించి గర్భవతులైనారు.*

8. ఆ.వె.// నెలలు నిండు కొలది నెలతల కళ హెచ్చె
చైత్ర శుద్ధ నవమి సమయమందు
పుడమి సంతసింప పుత్రోత్సవంబయ్యె
దశరథుండు మిగుల తనివి నొందె ॥

భావము : *నెలలె నిండే కొలది రాణుల ముఖంలో కాంతి, సంతోషం పెంపొందాయి, చైత్ర శుద్ధ నవమి నాటికి పుత్రోదయమై రాజు సంతృప్తి చెందాడు.*

9. తే.గీ.// శిష్ట రక్షణ దుష్టుల శిక్షణంబు
పొసగ శ్రీ హరి కౌసల్య పుత్రుడగుచు
రమణి తేజము రాజిల రాముడనెడు
సార్ధకంబగు పేరిడ జగతి నొడమె ॥

భావము : *దుష్ట శిక్షణా, శిష్ట రక్షణకై, శ్రీ మహా విష్ణువే కౌసల్యకు పుత్రునిగా జన్మించాడు అతనికి శ్రీరాముడని పేరు పెట్టారు.*

10. ఆ.వె.// సతిసుమిత్ర కనెను శత్రుఘ్నులక్ష్మణు
లనెడు కవల ఆని కనులపంట
భరతునికని కైక ప్రహ్లాదమందెను
పౌరులెల్ల మోదభరితులైరి ॥

భావము : *సుమిత్రాదేవికి కలిగిన కవలలకు లక్ష్మణ, శతృఘ్నులని, కైకకు పుట్టిన వానికి భరతుడని పేర్లు పెట్టారు. రాచనగరులో ఆనందం వెల్లివిరిసింది.*

11. తే.గీ.// వర్ధిలుచు నుండె దశరథ వత్సలంత
సర్వకళలందు మేటులసాధ్యులనగ
శుక్ల పక్షపు చంద్రుని శోభరీతి
పదియు నారేండ్ల ప్రాయమ్ము వారలైరి ॥

భావము : *పదహారు కళలతో పున్నమి చంద్రుడు శోభించినట్లుగా, దశరథ కుమారులందరూ కళలన్నింటిలో సమర్థులై అసాధ్యులనిపించుకునేలా పదహారేండ్ల వారైనారు.*

12. తే.గీ.// కొలువు నందుండ నొక నాడు కుశికపుత్రు
డర్థియై వచ్చి తావచ్చినట్టి కార్య
మధిపునకు జెప్పెనిట్లని నార్యవినుము
మునిజనంబులతోడనే ముచ్చటించి ॥

భావము : *ఒకనాడు రాజదర్బారుకి విశ్వామిత్ర మహర్షి వచ్చి యిలా చెప్పాడు, రాజా, మునీశ్వరు లందరితో చర్చించి వచ్చాను.*

13. తే.గీ.// జన్మమొక్కటి నేజేయు చున్నవాడ
రామునంపుము యాగంపు రక్షకునిగ
అనుచు నర్థింప మదిఁతేడు నాత్రపడుచు
విన్నవించెను మౌనికి వినయమొప్ప ॥

భావము : *నేనొక యాగాన్ని చేయదలిచాను యాగ రక్షకునిగా శ్రీరాముని పంపుము, అపుడు వినయంగా దశరథుడు యిలా విన్నవించుకున్నాడు.*

14. ఆ.వె.// రాముడు పసివాడు రాక్షసుల్ క్రూరాత్ము
లెటుల వారి గెలువ నేరడంచు
అతని విడువ లేక యధికభీతిని తేడు
పరితపింప తపసి బల్కె నిటుల ॥

భావము : *రాముడు పసివాడు రాక్షసులు క్రూరులు మన్నించండి మహర్షీ, భయంతో పుత్రవాత్సల్యంతో సతమతమౌతున్న రాజుతో ముని యిట్లా అన్నాడు.*

15. తే.గీ.// భయము నందకు మదిలోన పార్థివేంద్ర
నే నెరుగుదు రాముని నిజ బలమ్ము
రాక్షసుల బాధ నుడిగింప రాముడగుచు
మాధవుండిల బుట్టె నా మాట నమ్ము నిజము ॥

భావము : *రాజా, భయపడకు రాముని నిజబలం నీకన్నా నాకే తెలుసు అసలు రాముడంటే యెవరనుకున్నావు శ్రీమన్నారాయణుడే, రాక్షసులను చంపడానికి పుట్టినాడు.*

16. తే.గీ.// సర్వజన హితులముమేము సంశయమ్ము
నందకుము, రామునాతోడ నంపుమనెను
సమ్మతంబున రామ లక్ష్మణుల తోడ
పురము వీడ్కొని జనె యోగి పుంగవుండు ॥

భావము : *మేము అందరికి మేలు చేసే వారమే సందేహించక రాముని నాతోపంపు, రాజుని ఒప్పించి రామ, లక్ష్మణులను వెంటబెట్టుకుని బయలుదేరాడు.*

17. తే.గీ.// కుశిక పుత్రుని యాగంబు కౌశలముగ
రక్షణము జేసె రాముండు రక్కసులను
బాపి మారీచ దైత్య సుబాహు లణచి
రామబాణనిహత శౌర్య రాజసమున ॥

భావము : *శ్రీరామ రక్షగా నిరుపమాన ధైర్య సాహసాలను ప్రదర్శించి మారీచ, సుబాహులనే రాక్షసులను తరిమికొట్టి తన ప్రతిభ నిలబెట్టుకున్నాడు రాముడు.*

18. తే.గీ.// తనకు రక్షణగూర్చిన దాశరథికి
తాను కల్యాణమును గూర్ప దలచి మౌని
జానకీ స్వయంవరమును జాటుటెరిగి
బోవు మిథిలాపురంబుకు ద్రోవలోన ॥

భావము : *తన యాగాన్ని రక్షించిన రామునికి తాను కళ్యాణం చేయాలనుకున్నాడు విశ్వామిత్రుడు, సీతా స్వయంవరం ప్రకటించడం గ్రహించిన అతడు మిథిలా నగరత్రోవలో ఉండగా..,*

19. ఆ.వె.// రాముని శుభపాద రజము సోకినచోట
రాతియందునొడమె నాతి యొకతె
గౌతమ మునిసతిగ కౌశికుడెరిగించె
నిటుల జెప్పదొడగెనింతి గూర్చి ॥

భావము : *రాముని పాదధూళి సోకి ఒక రాతిబండ స్త్రీ రూపాన్ని సంతరించుకుంది, ఆమె గౌతమ మహర్షి భార్యయని తెలిపి ఆమెకథ యిలా చెప్పసాగాడు.*

20. ఆ.వె.// అమిత సుందరాంగి అహల్యా యామియె
శీలవతియె నిజము జెప్ప దలప
దేవతలకు రాజు దేవేంద్రుడనువాడు
ముగ్ధ అందమందు మోహమంది ॥

భావము : *రామా, ఈమె పేరు అహల్యా ఎంత అందగత్తో చూస్తున్నావుగా నిజానికి అంత శీలవతి కూడా. దేవేంద్రుడు ఈమె అందానికి ఆశపడ్డాడు.*

21. ఆ.వె.// ఆశ్రమంబు జేరి నద్ధమ రేయిని
కోడిచెందమొప్ప కూత వెట్టె
గౌతముండు స్నాన కార్యార్థమరిగిన
కాంతనతడుగలిసె కాంక్షతోడ ॥

భావము : *ఒకనాటి అర్ధరాత్రి గౌతముని ఆశ్రమానికి వచ్చి ఇంద్రుడు కోడిలా కూసాడు, తెల్లవారుతోందనుకొని గౌతముడు స్నానానికి వెళితే ఇంద్రుడు ఇంట్లో దూరాడు.*

22. కం// పతిరూపముతో నింద్రుడు
నతివను తమితోడగూడునాసమయమునన్
యతివరుడెరిగెను మోసము
సతికిన్ శిలవగు మటంచు శాపంబొసగెన్ ॥

భావము : *కామరూప విద్యతో గౌతముని రూపాన్ని ధరించి అహల్యతో కూడగా అమాయకంగా భర్తేయని తలంచింది ఆమె, ఇంతలో స్నానానికి వెళ్లిన గౌతముడు తిరిగొచ్చి మోసం గ్రహించి అహల్యను రాయిగా పడిఉండమని శపించాడు.*

23. ఆ.// తెలిసి తాకుగాక తెలియక తాకినన్
కరము నిప్పు సోక కాలుగాదె
తప్పు పరులదైన దండన పొందిన
నిస్సహాయురాలు నిజము దెలుప ॥

భావము : *తెలిసి ముట్టుకున్నా తెలియక చెయ్యి వేసినా నిప్పు కాల్తుంది కదా. తప్పు ఇంద్రునిదే అయినా ఈమె కూడా దండనకు గురి అయింది.*

24. కం// ముదితాపసి యివ్విధముగ
సుదతీ చరితంబు దెల్పి సురుచిర లీలన్
మిథిలానగరము జేరెను
వదలక సౌమిత్రి రామ వత్సలతోడన్ ॥

భావము : *విశ్వామిత్రుడు ఈ విధంగా అహల్య కథ చెబుతూ రామ, లక్ష్మణులతో కలసి మిథిలా నగరం చేరుకున్నాడు.*

25. కం// నానాదేశ నృపాలక
సూనులు రతిరాజు బోలు సుందర గాత్రుల్
మాన ధనాఢ్యులు వీరులు
జానకి పరిణయము గోరి జనుదెంచి రటన్ ॥

భావము : *అక్కడ మిథిలలో, అందానికి చంద్రులు అధిక బలసంపన్నులు అయిన అనేక మంది రాకుమారులు సీతను చేపట్టాలనే ఆశతో, స్వయంవరానికి వచ్చారు.*

26. తే.గీ.// గురు భుజబలమ్ము గల వీరకోటి భటులు
శివధనుస్సును మోయ సంశీలురగుచు
తెచ్చివేదిక నుంచిరి, తెల్పె జనకు
డానృపాలక నందను లాలకింప ॥

భావము : *కోటిమంది వీర భటులు ఎంతో కష్టం మీద ఆయాసపడుతూ శివధనుస్సు అనే పెద్ద విల్లును వేదికపై ఉంచారు. జనకమహారాజు రాకుమారులతో ఇలా అంటున్నాడు.*

27. కం// ఎవరీవిల్లును సరిగా
నవలీలగ నెక్కుపెట్టునధిక బలుండో
అవనీ సుతనా ఘనభూ
ధవునకు పరిణయ మొనర్తు దప్పక యిపుడే ॥

భావము : *ఓ రాకుమారులారా, మీలో ఎవరీ విల్లును ఎత్తి సంధించ గలరో అట్టి వీరునికి సీతనిచ్చి పెండ్లి చేస్తాను. అని చెప్పగా....,*

28. కం// విల్లాయిది కొండాయని
ఎల్లరు భయవిభ్రమమంబులేర్పడ మదిలో
తల్లడపడి దూరముగా
వెళ్ళిరి నృప సూనులంత వేదిక వీడన్ ॥

భావము : *అయ్యె బాబోయ్, విల్లా యిది పెద్దకొండా అని యత్నించి భంగపడకుండా చాల మంది చల్లగా తప్పుకున్నారు.*

29. తే.గీ.// జనక పుత్రియు సభ్యులు చకితులవగ
రాముడాధనుర్భంగమ్ము రయమొనర్చె
చక్కదనమున రతిరాజుచంద్రు డనుచు
భామలెల్లరు రాముని ప్రస్తుతింప ॥

భావము : *రాముడొక్కడే ముందుకొచ్చాడు ఒంటిచేత వింటినెత్తి నారి సారించాడు పుటుక్కున విరిగిపోయింది ఆశ్చర్యపోయారంతా అంతేనా నీలమేఘశ్యాముని రాముని జూచి మురిసి పోయారంతా.*

30. తే.గీ.// జనక రాజేంద్ర నీయనుజన్ముడైన
ఘనకుశధ్వజ తనయల గౌరవముగ
రామ సోదరులకిడి రమ్యగతిని
పరిణయ మొనర్పదగునని బల్కెమౌని ॥

భావము : *జనక రాజేంద్రా, స్వస్తి! ఈ శ్రీరాముడు దశరథ పుత్రుడు వీరు నలుగురు సహజన్ములు. నీ తమ్ముడైన కుశధ్వజుని కుమార్తెలను కూడా రామ సోదరులకిచ్చి వివాహం జరిపిస్తే బాగుంటుంది అని సూచించాడు విశ్వామిత్రుడు.*

31. తే.గీ.// రామునకు సీతతోడను రంజిలంగ
మాండవిన్ భరతునికిడి మరియు వేడ్క
నూర్మిళా లక్ష్మణులకును కూర్మి మీర
వరలె శత్రుఘ్న శ్రుతకీర్తి పరిణయములు ॥

భావము : *దశరథునితో సంప్రదించాడు జనకుడు. సీతారాములకు, మాండవీ భరతులకు,ఊర్మిళాలక్ష్మణులకు,శ్రుతకీర్తి శత్రుఘ్నులకు నిశ్చయం జరిగింది.*

32. తే.గీ.// బంధు పరిజన సంతోష భరితమగుచు
వంది మాగధ సామంతు లందరందు
పౌర సంతోష ముత్సవ ప్రగతి నొంద
జనక దశరథా మోదమైజరిగెనపుడు ॥

భావము : *ఆ కళ్యాణాలు వేదమంత్రాలతో, విందువినోదాలతో, ఆనంద సంధాయికాలై బ్రహ్మాండంగా జరిగాయి.*

33. ఆ.వె.// తండ్రియాజ్ఞలెల్ల తనయులు తలదాల్ప
చాల పెద్దకాల మేలె ధరణి
పాలనాన రామ పట్టాభిషేకంబు
చేయజాటె రాజు సిద్ధపడుచు ॥

భావము : *తండ్రి పరిపాలనలో కుమారులుండగా చాలాకాలం తర్వాత దశరథ మహారాజు భావిమహారాజుగా రామ పట్టాభిషేకం చాటింప సిద్ధ పడ్డాడు.*

34. తే.గీ.// దాసి మంధర దుర్బోధ దలచి కైక
నాటి రేయిని పతినను నయముతోడ
వసుమతీశ్వర మునునాకు వరములిడిరి
నేడు దయసేయ గోరెద న్నేనటంచు ॥

భావము : *మంధర అనే పేరు గల దాసి దుర్బోధకు లొంగి కైక నాటి రాత్రి దశరథునితో నాకు రెండు వరాలు ప్రసాదించారు నేడు అనుగ్రహింప గోరెదను అన్నది.*

35. తే.గీ.// భరతు పట్టాభిషిక్తుగా వరల జేయ
మునిగ వర్తింప బంపుడు వనికి రాము
డరయు పదునాల్గు వర్షంబులనుచు బల్కె
పిడుగు పాటున గూలెను పెద్దరాజు ॥

భావము : *నా కుమారుడు భరతునికి పట్టాభిషేకం చేయడం మొదటిది, 14 సంవత్సరాలు రాముని అరణ్యవాసం చేయమనడం రెండోది ఆమె కోర్కెలు. అది విన్న రాజు నెత్తిన పిడుగు పడ్డట్టు అయినది.*

36. ఆ.వె.// రాజ్యమేలు గాక రాజు నీ కొమరుడై
వనికి రాము నంప వలదు వలదు
రాముడేమి జేసె రాజీవలోచనా
అంత కోప మేల యతని పైన ॥

భావము : *రాణీ, కావాలంటే భరతుడినే రాజుగా చేయి. కానీ రాముడిని అడవికి పంపమని పట్టుబట్టకు, రాముడేం తప్పు చేసాడు, వద్దు రాణీ నా మాట విను.*

37. కం// రాముడె నా ప్రాణంబగు
రాముడె నా జీవనంబు రాముడు వెడలన్
నేమరి జీవింపను, విను
రామునిపై దయను జూపు రాకేందు ముఖీ ॥

భావము : *నా పంచ ప్రాణాలు రాముడే, క్షణం విడిచి బ్రతుకలేను. రాముడు అడవికి వెళ్ళిన తక్షణమే నా ప్రాణం పోతుంది. రామునిపై దయను చూపవా అంటూ యిలా బ్రతిమాలాడు.*

38. ఆ.వె.// సుతులు లేని బాధ స్రుక్కితి వీవును
లేకలేక కలుగు లేత వాని
అడవి పాలు జేయ నడుగుట కెటులొ్ప్పె
తల్లి వైన నీకు తగునె దేవి ॥

భావము : *పిల్లలు లేరని ఎంతో పరితపించాము. ఆ బాధనువ్వా అనుభవించావు, లేక లేక కలిగిన వానిని పొమ్మనడానికి నీమనసెలా అంగీకరించింది. తల్లివైన నీవు ఈ పాపానికి ఎలా ఒడిగట్టావు.*

39. ఆ.వె.// అనుచు విభుడు వేడె నాలకింపదు కైక
లోభ మాశ్రయింప లోకమందు
ప్రేమ మరుగు పడును పెన్నిధి నాశింప
జాలి చూపబోదు సవతి తల్లి ॥

భావము : *ఎంత మొత్తుకున్నా పట్టిన పట్టు విడువలేదు కైక లోకంలో సంపదకాశపడిన వారు ఎంత పాపానికైనా దిగజారుతారు. ప్రేమ మరుగున పడిపోతుంది, అయినా సవితి తల్లికి జాలెందుకుంటుంది.*

40. కం// పిన తల్లి కైక కోరిక
విని రాముడు సత్వరంబు విపినంబునకున్
జనకుని మాటను నిల్పగ
జనవాయత్త పడగ, వడి సతి సీతయు దాన్ ॥

భావము : *పిన్ని కోరిక విన్న రాముడు తండ్రి మాట నిలబెట్టాలని వనవాసానికే సిద్ధ పడ్డాడు. సీత అభిప్రాయం కూడా ఇదే.*

41. ఆ.వె.// నార చీర కట్టి నల్వురితో జెప్పి
పయన మాయె నంత ప్రాణ విభుడు
వనిత కష్ట యుతము వనవాసమేగను
వలదు మాను మనిన పంకజాక్షి ॥

భావము : *నార చీరలు ధరించి నలుగురితో చెప్పి సీత కూడా సిద్ధపడ్డాది రాముడు వద్దని వారిస్తే సీత ఇలా అంటోంది.*

42. ఆ.వె.// పతిని గలిసి యున్న వనియైన గిరియైన
రమ్య హర్మ్యమగును రమణికెపుడు
కనక దుర్గమైన ఖైదుగా దోపదే
భర్త లేని బ్రతుకు భార్య కేల ॥

భావము : *భర్తతో కలిసి ఉంటే అవి కొండలైనా కోనలైనా భార్యకు అందాల మేడల్లాగే తోస్తాయి. బంగారు కోటైనా బంధిఖానా గానే ఉంటుంది. భర్త లేని బ్రతుకు భార్యలు ఊహించరు.*

43. కం.// కోరను నేనే సుఖముల
మీరను మీయానతెపుడు మించిన దయతో
వారింపకు నా స్వామీ
దూరంబై నిలువ జాల దోడ్కొని పోవే ॥

భావము : *స్వామీ, నేనేసుఖాలు కోరను మీ మాట జవదాటను నన్ను రావద్దనకండి మీకు దూరమై బ్రతుక లేను కాబట్టే నన్ను మీతో తీసుకొని పొండి.*

44. ఆ.వె.// అనుచు కోరి సీత యనుమతి వడిసెను
నిన్ను విడువ జాల నేనటంచు
లక్ష్మణార్యుడపుడు రాముని తోడుగా
అడవులందు దిరుగ నడుగ లడల ॥

భావము : *అని ప్రార్థించి అనుమతి పొందింది సీత. అన్నా నిన్ను విడిచి నేనుండగలనా. నీతోటే వస్తా అంటూ ప్రయాణమయ్యాడు లక్ష్మణుడు. ఇలా వారంతా వన వాసానికి బయలు దేరే సరికి ,,,.*

45. తే.గీ.// ప్రజలు దుఃఖింప నోదార్చి రాముడపుడు
స్వర్ణ భద్రా నదిని దాటె సత్వరమ్ము
గుహుని నావలో యాతని కూర్మి మెచ్చె
నట భరద్వాజ నాతిధ్య మందివెడలె ॥

భావము : *ప్రజలంతా దుఃఖించసాగారు. వారినోదార్చి గుహునినావలో స్వర్ణ భద్రానదిని దాటి భరద్వాజుడనే ఋష్యాశ్రమంలో అతిథిగా ఉండి బయలుదేరాడు రాముడు.*

46. తే.గీ.// చిత్రకూటము వారలు చేరుసరికి
భరతుడేతెంచి యన్న సద్భక్తి మ్రొక్కి
తండ్రి మరణము నెఱిగించిఁ దడయకుండ
రాజ్యపాలన చేకొన రమ్మటంచు ॥

భావము : *చిత్రకూటము అనే పర్వతంపై మజిలీ చేస్తూండగా భరతుడు పరిగెత్తుకొచ్చాడు తండ్రి మరణవార్త తెలిపి, రాజ్యపాలనకై రమ్మని కోరాడు.*

47. ఆ.వె.// ప్రార్ధనమ్ము జేయ భరతుని గని మెచ్చి
తండ్రి యాజ్ఞనెరుప దగును, పిదప
రాకమాన ననుచు రాముండు పల్కిన
చింత నంది యతడు చెప్పె నిటుల ॥

భావము : *భరతుని భక్తి విశ్వాసాలకు సంతోషించి తండ్రి మరణించినా తనయులు మాట నిలబెట్టాలని బోధించి వనవాసం పూర్తికాగానే తప్పక వస్తానన్నాడు.*

48. ఆ.వె// అన్న సొత్తు దోచు నధముండు వీడను
అపయశమ్ముదొలగ నాదు కొనవె
పాదుక లవి యిమ్ము పట్టమ్ము గట్టెద
అనుచు వేడుకొనియె నాతడపుడు ॥

భావము : *అన్నా, నీసొత్తు దోచుకున్నాను అధముడను అనే చెడ్డపేరు రాకుండా కాపాడడానికి నీ పాదుకలైనా నాకిమ్ము వాటికి పట్టాభిషేకం చేసి కాపు కాస్తాను.*

49. తే.గీ.// భరతుడడిగిన పాదుకల్ పరమప్రీతి
నిచ్చి పంపెను శ్రీరాముడేర్పడంగ
పిదప నగ్గిరి వీడుచు వెడలి నారు
వార లనివార్య విధిమార్గ వర్తులగుచు ॥

భావము : *భరతుని కోరిక ప్రకారం పాదుకలిచ్చి పంపాడు. తదుపరి ఆ మజిలీ విడిచి ఏమి జరగవలిసి ఉందో ఆ మార్గంలో రాముని ప్రయాణం సాగింది.*

50. తే.గీ.// పంచవటి జేరి నిర్మించి పర్ణశాల
కాపురంబుండి నచ్చోట గడుపుచుండ
శూర్పణఖ యను రాక్షస సుదతి యొకతె
రామునింపగు సొగసుకు లాలసగుచు ॥

భావము : *దండకారణ్యంలో పంచవటి అనే పర్ణశాల నిర్మించుకుని అక్కడ కొన్నాళ్ళు కాపుర ముండాలనుకున్నారు. కానీ ఓ రోజు శూర్పణఖ అనే రాక్షస స్త్రీ రాముని అందానికి ఉవ్విళ్ళూరి ఇలా అంది.*

51. ఆ.వె.// వలపుకాడ నన్ను వరియింపు మనికోరె
రాముడిట్టులనియె రమణి తోడ
నాకుతమ్ము డతడు నాకన్న రూపసి
యనుచు మారుబల్కె నతివ తోడ ॥

భావము : *వలపుకాడా నన్ను వరియించమని కోరింది. నాకన్నా అందగాడు నా తమ్ముడు అదిగో అని చూపి పరిహాసమాడాడు రాముడు.*

52. తే.గీ.// లక్ష్మణార్యు జేరి లాలస దెల్పిన
తరుణి ముక్కుగోసి దరిమి గొట్టె
ధీర చిత్తులెపుడు తెరవకు లొంగరు
నీతి దప్పి జనరు నిపుణ మతులు ॥

భావము : *అయితే నువ్వే ఏలుకో అని లక్ష్మణునిపై పడింది శూర్పణఖ. అతడు కోపించి ముక్కు చెవులు కోసి బుద్ధి చెప్పాడు. ధృడమనస్కులు - అన్యమనస్కులు కారు, నిజమైన నిపుణమతులు నీతి తప్పుతారా.*

53. తే.గీ.// భారతావని దక్షిణా పథపు దరిని
యబ్ధి లంఘింప నొకదీవి యచట గలదు
రాక్షసావాస కేంద్రమై లంక యనగ
రాజు దానికి ఘనుడైన రావణుండు ॥

భావము : *భారతదేశానికి దక్షిణంగా సముద్రం దాటి వెళితే ద్వీపముంది. దానిని లంక అంటారు. త్రేతాయుగంలో అక్కడ రాక్షసులుండేవారు. వారికి రాజు రావణుడు.*

54. తే.గీ.// గొప్ప శివభక్తు డయ్యును, కులము వలన
రాజసంబును వీడడా రాక్షసుండు
ప్రజకు కంటక ప్రాయుడై ప్రబలుచుండె
శూర్పణఖ చెల్లె లౌనునీ శూరదనుజు ॥

భావము : *రావణాసురుడు గొప్ప శివభక్తుడు. అయినా కులంచేత అబ్బిన రాజసగుణంపోలేదు. ప్రజలకు కంటకుడై బాధిస్తూండేవాడు. వాని చెల్లెలు శూర్పణఖ.*

55. తే.గీ.// అన్న రావణు దరి కేగి యామెజెప్పె
తన పరాభవ గాథను దనుజ పతికి
సీత అందము వర్ణించి జెప్పినంత
రావణుండామెపై ననురక్తుడవగ ॥

భావము : *ఆమె తన అన్నగారైన రావణునికి తన కాయగాయాల్ని పరాభవాన్ని చెప్పి సీత అందాన్ని కూడా కళ్ళకు కట్టినట్లు వర్ణించింది.*

56. తే.గీ.// ఆమెతో గూడు వారిదే యమర సుఖము
యనుచు శూర్పణఖ పొగిడె నంత దైత్య
పతియు మారీచు మాయల పన్న బంపె
తాను మాయా మునిగ వేషధారి యగుచు ॥

భావము : *సీతలాంటి అందగత్తె పొత్తు పొందలేని బ్రతుకెందుకు, అని పురిగొల్పింది. వెంటనే రావణుడు మారీచుని మాయలు పన్నుటకు పంపి, తానుకూడా జంగమదేవర వేషం ధరించాడు.*

57. కం.// బంగారు లేడి రూపున
చెంగున తా పర్ణశాల చేరిన మారీ
చుంగని, వేడుక జానకి
రంగగు నాలేడి తేగ రాముని గోరెన్ ॥

భావము : *మారీచుడు బంగారు లేడి రూపం ధరించి అందీ అందక సీతా సమీపంలో తిరుగాడ సాగాడు. సీత ఆ లేడినిచూచి ముచ్చటపడి దానిని పట్టితెమ్మని శ్రీరాముని కోరింది.*

58. తే.గీ.// కుటిల మృగ శాబకంబున కోర్కె వలన
రాముడేగెను దూరమరణ్యమునకు
అమ్ము చేజిక్కి లక్ష్మణా రమ్మటంచు
ప్రాణముల వీడె నా లేడి వసుధ వ్రాలె ॥

భావము : *పట్టుకుందామని రాముడు వెంటపడ్డాడు. అందీ అందక రాముడ్ని వంచిస్తూ అలా దూరంగా అడవిలోకి తీసుకు పోయింది. అఖరికి రాముడు బాణంతో కొట్టాడు. దెబ్బతిని హా లక్ష్మణా రా అంటూ నేలపడి కూలి చచ్చిపోయింది.*

59. ఆ.వె.// ఆర్తనాద మగుట లక్ష్మణుండటు వైపు
పోవు తరిని గాంచి రావణుండు
పర్ణశాల జేరి భవతి భిక్షాందేహి
యనుచు కేక వెట్టె - నవని జాత ॥

భావము : *ఆ కేక వినిపించడంతో సీత మరి తోచనివ్వలేదు. అన్నగారికేమయిందో చూచి రమ్మని లక్ష్మణుని పంపేసింది. అదనుచూసి భవతిభిక్షాందేహియని పిలిచాడు రావణుడు.*

60. తే.గీ.// భిక్షమిడగ రాగ పృథివిని పెకలించి
కాంతను గొని పోగ కపట యోగి
కరుణ తోడ నన్ను కావగ రారయా
వృక్ష జాతు లార పక్షు లార ॥

భావము : *భిక్షపెట్టాలని వచ్చింది సీత. ఆమె నిలిచిన భూభాగాన్నే పెకలించి పుష్పక విమానంపై ఉంచి తీసుకు పోయాడు రావణుడు. రక్షించండి వృక్షాల్లారా, పక్షులారా అని ఆక్రందించింది సీత.*

61. ఆ.వె.// అనుచు సీత మొరల నార్తితో నొనరింప
వినీ జటాయువనెడి విహగ నాథు
డరుగ దెంచి యుద్ధ మత్యుగ్రముగ జేసి
పక్ష హీను డగుచు పడెను ధరణి ॥

భావము : సీత మొర పెట్టేసరికి జటాయువు అనే పక్షి రావణుడ్ని ఢీకొంది. శక్తి కొద్దీ పోరాటం చేసింది. రెక్కలు తెగి నేలకూలిపోయింది.

62. ఆ.వె.// పర్ణశాల జేరి పరికింప నచ్చోట
సీత గానబడక చింత నంది
వెదుక నుద్యమించె వేదన నొందుచు
రామలక్ష్మణార్యు లడవి యందు ॥

భావము : రామలక్ష్మణులు పర్ణశాలకొచ్చి చూస్తే సీత కనిపించలేదు. అన్నదమ్ములిద్దరు సీతాన్వేషణలో అడవంతా వెదుకసాగారు.

63. ఆ.వె.// శబరి యనెడు బోయ సాదర భక్తితో
దర్శనంబు గోరి తపము సలిపె
అతిథు లగుచు వారు నామె భక్తికి మెచ్చి
ఫలములారగించి పయనమయిరి ॥

భావము : శబరి అనే బోయ స్త్రీ రామ దర్శనార్థం తపస్సు చేసింది. ఆమె భక్తికి మెచ్చి, ఇచ్చిన రేగుపళ్ళ విందు ఆరగించి సీతను వెతుక సాగారు రామలక్ష్మణులు.

64. ఆ.వె.// కొండ చరియలెల్ల కోయని ధ్వనియింప
భక్తి తోడనొక్క వానరుండు
చేర దేవ దయను శ్రీరామ శుభనామ
రామ రామయనుచు ప్రస్తుతింప ॥

భావము : కొండకోనలు ప్రతిధ్వనించేలా శ్రీరామాయని నామ జపము చేసే ఓ వానర భజన గమనించి, లక్ష్మణుడు,

65. ఆ.వె.// రామ లక్ష్మణార్యు లాదారి నరుగుచు
భక్త వానరమ్ము భజన వినిరి
వానరోత్తముండ వచ్చెను రాముడు
కామితమ్ము దెలుపు కనులు దెరువు ॥

భావము : *వానరోత్తమా, నీ రాముడు విచ్చేసాడు కనులు తెరిచి చూచి కోరిక తెలపమని అన్నాడు.*

66. ఆ.వె.// అనుచు లక్ష్మణుండు నాతనితో బల్క
రామపాద యుగళి వ్రాలె నపుడు
క్రింద లోయనున్న కిష్కింధ రాజ్యమ్ము
వాసి నయ్య నేను వాయు సుతుడ ॥

భావము : *లక్ష్మణుని మాటలకు స్పందించి రాముని దివ్య సుందర విగ్రహం కనులారా చూచి పాదాలపై పడి రామా, దిగువ లోయలో ఉన్న కిష్కింధరాజ్యం నాది వాయు సుతుడను నేను. అని చెప్పాడు.*

67. తే.గీ.// స్వామి దయచేయు మనియంచు వాయుసుతుడు
పొదలకావంక దోడ్కొని పోయెనంత
ఇతడు సుగ్రీవుడీరాజ్య మితని దయ్య
వాలి యీతని యన్నయే, వావి మరచి ॥

భావము : *స్వామీ, దయచేయండంటూ కొందరు వానరవీరులకు పెద్దైన సుగ్రీవుని చూపి ఈ రాజ్యం ఇతనిదే. వాలి అనే వీని సోదరుడు వావివరుసలు మరచి ....,*

68. తే.గీ.// ఇతని రాజ్యమ్ము రమణిని యేలుకొనుచు
పరమ దుర్మార్గుడై మమ్ము పారద్రోలె
శరణ మీవిక మము గావ సమర మందు
ననుచు పరిచయ మొనరించె నాతడపుడు ॥

భావము : *ఇతని రాజ్యాన్ని ఇతని భార్యను బలవంతంగా లాక్కున్నాడు. శత్రువు బలాన్ని కూడా గ్రహించే వాలిబారి నుండి మమ్మల్ని కాపాడుతావని శరణుగోరుతున్నాం. అంటూ పరిచయం చేసాడు హనుమంతుడు.*

69. తే.గీ.// అన్న దమ్ముల కలహమ్ము నాలకించి
వాలిని వధించి సుగ్రీవు పాలకునిగ
వేట ధర్మబద్ధ మనుచు జాటె, కపులు
సీత జాడలు వెతుకంగ సిద్ధ పడిరి ॥

భావము : *వాలి సుగ్రీవుల కలహం విని వాలిని సంహరించి సుగ్రీవునకు పట్టం గట్టాడు రాముడు. తన సైన్యంతో సీతను వెతుక సిద్ధ పడ్డాడు సుగ్రీవుడు.*

70. ఆ.వె.// కపి కులంబులెల్ల కపినాథు నానతి
సీత కొరకు వెదకె చింత నొంది
గిరుల తరుల వెతకి గిరి మహేంద్రమున, సం
పాతి పక్షనిహత పక్షి వలన ॥

భావము : *సుగ్రీవాజ్ఞ మీరగలవాడు లేడు. వానరులంతా చెట్టనక పుట్టనక గాలించారు. మహేంద్రగిరి అనేచోట అలనాడు రావణునితో ఢీకొని రెక్కతెగిపడిన సంపాతి వలన..,*

71. ఆ.వె.// లంక వంక బోవు రాముణు దుశ్చేష్ట
వినుచు వారలంత వేగ జలధి
జేరి, ముద్రిక గొని 'జే' యన హనుమంతు
డబ్ధి లంఘనమ్ము నపుడొనర్చె ॥

భావము : *రావణుడు సీతని అపహరించాడనే వార్త తెలుసుకున్నారు. ఆంజనేయుడు రామ ముద్రిక గొని సముద్రాన్ని దాటి లంక చేరుకున్నాడు.*

72. తే.గీ.// సంధ్య కెంజాయ లలవోక సమయు వేళ
చుక్కలు కలంగి నభమున నిక్కి జూచె
శోక వివశత సీత యశోకవనము
నందు రాముని దలచుచు నలతనొందె ॥

భావము : *అసుర సంధ్యాకాలంలో దాగిన చుక్కలునిక్కి మిణుకుమిణుకు మంటున్నాయి. అది లంకలోని అశోకవనం. శోకదేవతలా ఉన్న సీత రాముడ్ని తలచి దుఃఖిస్తోంది.*

73. తే.గీ.// మదను శరబాధ నున్మాద మెద జనింప
రామణుండ లంకార విలాస మొప్ప
నటకు నేతెంచె వైభవ మంత జూప
శీర్ణ శోకాకుల యగు నా సీత కడకు ॥

భావము : *మన్మథబాణాల ఉన్మాదానికి గురియైన రావణుడు అలంకారాలతో తన వైభవాన్ని చాటడానికా అన్నట్లు శోకముద్రలోయున్న సీతను చూడవచ్చాడు.*

74. ఆ.వె.// మూడు లోకములను ముమ్మారు గెలిచిన
ఘనుడ నేను నన్ను గాంచ వేల
లేడి పిల్ల నైన లేచి చంపగ లేని
వాని దలుప నేల వారిజాక్షి ॥

భావము : *సుందరీ, ముల్లోకాలను మూడుమార్లు గెలిచిన ఘనుడనేను. నన్ను చూడు లేడిపిల్లనైనా పట్టుకోలేని ఆ రాముడ్ని తలుచుకుంటే ఏం లాభం.*

75. ఆ.వె.// మునుల తోడ గూడి వనులందు తిరిగెడి
జడుని వలన నేమి సౌఖ్యమబ్బు
రమ్యహర్మ్య మందు రాణివై నాతోడ
సర్వ సుఖములందు సారసాక్షి ॥

భావము : *మునులతో గూడి అడవులలో తిరిగే అతనివలన నీకేమి సుఖం. అద్దాల మేడల్లో నా రాణివై సర్వ సుఖాలు అనుభవించవచ్చు.*

76. ఆ.వె.// రాము డబ్ధి దాటి లంకకు రాలేడు
వచ్చె నేని బ్రతికి బైట పడడు
పరుని యింటనున్న భార్యను గూడడు
రామ నామ జపము రమణి విడువు ॥

భావము : *రాముడు సముద్రాన్నిదాటి లంకకు రాలేడు. వచ్చినా బ్రతికి బయటపడడు, పడినా పరాయి ఇంటనున్న భార్యను ఏలుకోడు. ఇంకా రామనామ జపం ఎవరికొరకు.*

77. ఆ.వె.// పొందు నన్ను గూడి పూబోడి సుఖముల
పంతమూన నేల వనిత యనుచు
స్వాతిశయము జూపి సరసోక్తు లాడెను
రాగ గర్వ యుతుడు రావణుండు ॥

భావము : *నావద్ద సర్వ సుఖాలు ఉన్నాయి. ఎందుకొచ్చిన పంతాలు అతడ్ని మరచిపో అంటూ గర్వమతియై రావణుడు తన గొప్పలు చెప్పుకున్నాడు.*

78. కం.// పరకాంతల కామించిన
పురుషుల కాయువు నశించు పూజ్యత బోవున్
నరకము పొందెద రనుచును
ధరణీ సుత బోధ సేయు తరుణము నందున్ ॥

భావము : *పరాయి స్త్రీలను కాముకుడవై కోరుకోకు. నీ గౌరవం పోతుంది. నరకానికే పోతావు అంటూ సీత బోధచేసింది.*

79. ఆ.వె.// ఆపు ధర్మబోధ యని పల్కి క్రుద్ధుడై
రెండు నెలలలోపు లేమ లొంగ
కున్న జంపుడనుచు కోపమతిశయింప
రయము మీర వెడలె రావణుండు ॥

భావము : *ఆపు నీ ధర్మబోధ రెండు నెలల్లో నామాట వినకపోతే ఈమెను చంపండి అని అక్కడి కాపలా వారికి ఆజ్ఞాపించి పోయాడు రావణుడు.*

80. తే.గీ.// అవ్విధిని బల్కి రావణుడంతి పురికి
వెడలె, - వృక్షాగ్ర మందుండి వేగి రమున
వాయునందను డివ్విధి బల్కె - జనని
నన్ను రాముని బంటుగా నమ్ము మనుచు ॥

భావము : *అతడు అంతఃపురానికి పోగానే అంత వరకు అక్కడే చెట్టుకొమ్మల దాగివున్న మారుతి వెడలివచ్చి సీతాసాధ్వికి అమ్మా నేను రామబంటునని నమ్మబలికాడు.*

81. తే.గీ.// రామ ముద్రిక వేడ్కనా రామ కిడెను
తన శిరోరత్నమును యిచ్చి తపనదెలిపె
వనము నాశన మొనరించె పవన సుతుడు
ఉగ్రుడై రాక్షసుల గూల్చె నాగ్రహమున ॥

భావము : *రామముద్రికను ఆనవాలుగా ఇచ్చాడు. సీత శిరోరత్నమును గోరి క్షేమము తెలిపి, అశోకవనమంతా నాశనం చేసి అడ్డువచ్చిన రాక్షసులను చితకబాదాడు.*

82. ఆ.వె.// ఇంద్రజిత్తను యసురేంద్ర తనయునకు
కోరి కట్టువడెను ధీర వరుడు
రావణు సభ కేగి రాముని కోపాగ్ని
బడకు శలభమగ్ని బడెడు రీతి ॥

భావము : *ఇంద్రజిత్తనే రావణపుత్రునికి కోరి బందీఅయి సభకు వెళ్ళాడు. జాగ్రత్త రావణా రామునితో వైరంవద్దు అగ్గిలో పడిన మిడతలా మాడిపోతావు అన్నాడు.*

83. ఆ.వె.// అనెను పవన సుతు డాగ్రహావేశుడై
దూత జంప దగడు దొరల కగుట
వాలమునకు నిప్పు వారెల్ల రగిలింప
లంక దహన బరచి రహిని జనియె ॥

భావము : *అతని హెచ్చరిక విన్న రాక్షసులు కోపంవట్టలేక కోతితోకకు నిప్పంటించారు. లంకానగరాన్నే కాల్చి పారిపోయాడు హనుమంతుడు.*

84. ఆ.వె.// వాయు నందను డారాము వసతి చేరి
చూచి వచ్చితి, జానకీ శోక మూర్తి
కాల్చి వచ్చితి, లంకకు ఘనత దెలుప
యుద్ధ మనివార్య మనుచును క్రుద్ధుడాయె ॥

భావము : *నా తల్లి సీతను చూచాను మన తడాఖా తెలియాలని లంకను కాల్చి వచ్చాను. యుద్ధం తప్పదని హనుమంతుడు కోపంతో రాముని వసతి వద్ద పలికాడు.*

85. తే.గీ.// లంకనా సమయము నందు రావణుండు
వేగ మంత్రుల బిలిపించి విశదపరచె
రామదండును గూర్చి వార్తలను దెల్పి
యుద్ధ సంభార సిద్ధుడై యున్న దరిని ॥

భావము : *అదే సమయంలో రావణుడు లంకలో సభచేసి మంత్రులతో చర్చించి రామదండు గూర్చి తెలుసుకుని యుద్ధానికి సిద్ధపడుతున్నాడు. అపుడు......,*

86. తే.గీ.// సీత రాముని గూడగా జేయుమన్న
తగదు వైరము రాముతో దల పడంగ
శరణు గోరుము తగదు నీ సాహసమ్ము
యని విభీషణుడన్నతో ననియె నంత ॥

భావము : *అన్నా రావణా, ఆలోచించు సీతను తేవడం మనముందు తప్పు. సాహసంతో, రామునితో వైరం వద్దు. సీతనప్పగించి శరణుకోరమని విభీషణుడన్నాడు.*

87. ఆ.వె.// పిరికి పంద వనుచు పేరల్కతో నెట్టె
లంక వెడల గొట్టె రావణుండు
జేరి రామ శరణు గోరె విభీషణు
ని, కభయంబు నిచ్చె నిశ్చలతకు ॥

